

# అక్కడే ఆగక

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

**చైత్ర ఫోన్‌లో** మాట్లాడాక సంజీవ భార్యని అడిగాడు.

"ఆద్య మాట్లాడలేదు కదా?"

"లేదు."

"మనం ఏం చేసామని? తల పొగరు కాకపోతే మాట్లాడొచ్చుగా?" కోపంగా చెప్పాడు.

"మీరనుకున్నది కాదు. సిగ్గు, అవమానం."

"ఇంట్లో ఉంటే నాకు అవే ఆలోచనలు. అది ఎప్పటికి తేరుకునేను అని ఒకటే బాధ. సాయంత్రం సంజీవ అడిగాడు.

"సినిమాకి వెళ్ళేలా ఉందా నా మనసు?"

కొద్దిసేపు ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించి ప్రవర్ధనని అడిగాడు.

"పోనీ సూర్యచంద్ర వాళ్ళని భోజనానికి పిలవనా? వాళ్ళు సరదా మనుషులు. కాసేపు నవ్విస్తారు."

"అలాగే. ఆ ముసలాయన్ని కూడా పిలవండి" ప్రవర్ధన ఒప్పుకుంది.

"ఆయన ముసలాయనేం కాదు. ఈ రోజుల్లో ఎవరైతే తమ పనులని తాము చేసుకోలేక ఇతరులమీద ఆధారపడతారో వాళ్ళే ముసలివాళ్ళు. వారానికి రెండుసార్లు సంతకెళ్ళి కూరలు మోసుకొచ్చేది ఆయనే."

"అన్నట్లు కూరలు కూడా తేవాలి మీరు."

సంజీవ తన మిత్రుడు సూర్యచంద్రకి ఫోన్ చేసాడు.

"చెప్పరా జీవా" అతని మాటలు వినపడ్డాయి.

"రాత్రికి మా ఇంటికి భోజనానికి రమ్మని పిలవడానికి ఫోన్ చేసాను."

"మీ ఇంట్లోనా? మా ఇంటికి రావచ్చుగా?" నిరుత్సాహంగా అడిగాడు.

"మీ ఇంటికైతే నేనొక్కడ్నే రావాలి. అలా చాలాసార్లు వచ్చాను. మీరు ఇక్కడికి వస్తే మనమంతా కలిసి తినచ్చు. మీ నాన్నగారిని కూడా తీసుకురమ్మని ప్రత్యేకంగా చెప్తున్నాను.

"ఆయనకే ఇస్తానుండు."

కొద్ది క్షణాల తర్వాత సూర్యచంద్ర తన భార్యతో మాట్లాడే మాటలు నేపథ్యంలో వినిపిస్తూండగా సూర్యచంద్ర తండ్రి గొంతు వినిపించింది.

"నీకు తెలియందేముంది? మీ ఇంటికి వస్తే బకాసుర మృష్టాన్న భోజనం తప్ప ఇంద్రుడిలా సురాపానం ఉండదుగా. ఇంకెన్ని రోజులుంటానో కాని నన్నొదిలేయ్. మీకు చాలా రోజులున్నాయి నాకు లేవు."

"అయ్యో అంకుల్ అలా అనకండి" సంజీవ నొచ్చుకుంటూ చెప్పాడు.

"పెళ్ళై ఇన్నేళ్ళైనా మీ ఆవిడని మార్చలేకపోయావ్. నువ్వే నా కొడుకైతే రోజూ ముక్కచివాట్లు తినేవాడివి. కోడల్ని తిట్టే సంప్రదాయం మాలో లేదు. చివర్లో ఇంత వండి పెట్టేది కోడలేగా. దాంతో విరోధం పెట్టుకోవద్దని మా అమ్మ మా అందరికీ  నూరిపోసింది. ఈసారికి వదిలెయ్."

సూర్యచంద్ర భార్య లైన్‌లోకి రాగానే తన భార్యకి ఫోన్ ఇచ్చాడు.

"అట్టే శ్రమపడకండి ఆంటీ. వంట రుచిగా లేకపోయినా ఇదవకు. మేమేం అనుకోం" ఆవిడ చెప్పింది.

లైన్ కట్టయ్యాక ప్రవర్ధన కోపంగా ఎప్పింది.

"ఆంటీట. ఆంటీ. నాకంటే రెండేళ్ళు పెద్దది. పైగా బాగా వంట చేయనట."

"అసలు మనం వాళ్ళని పిలిచేది ఎందుకు? రిలాక్సేషన్‌కి కదా. వాళ్ళింట్లో మందు మాకు ఉంటుందని నువ్వు రానంటావు."

"అవును. నేను రాను."

"ఆవిడది తూర్పు గోదావరి జిల్లా హాస్యం. కాకపోతే ఆ జిల్లా సగటు హాస్యంకన్నా కొంత ఘాటు ఎక్కువ. అంతేగా" సంజీవ సముదాయించాడు.

చైత్ర ఆ సాయంత్రం ఆఫీస్‌నించి వచ్చాక బల్లమీద చాప్‌స్టిక్స్‌ని, ఓ కప్పులోని శెనగబద్దల్ని ఖాళీ కప్పుని చూసి ఆద్య వాటిని ప్రాక్టీస్ చేస్తోందని సంతోషపడింది.

"మనం ఈ రాత్రి బయట భోజనం చేద్దాం సూచించింది.

తన స్కర్ట్‌ని చెల్లెలికి ఇచ్చింది. ఇద్దరూ తయారయ్యారు. షెల్ఫ్‌లోంచి ఓ పుస్తకాన్ని తీసుకుని చెల్లెల్ని పదినిమిషాల నడక దూరంలోని ఎయిర్ కండిషండ్ రెస్టరెంట్‌కి తీసుకెళ్ళింది. ఇంగ్లీష్ పాటలు మంద్రస్థాయిలో వినిపిస్తున్నాయి. అందులో ఉన్న అరడజను మదికి పైగా తెల్లవాళ్ళే. అక్కడ గోడకి చెక్క షెల్ఫ్‌లో దాదాపు వంద పుస్తకాలదాకా ఉన్నాయి.

చైత్ర తనతో తెచ్చిన పుస్తకాన్ని ఆ షెల్ఫ్‌లో ఉంచి, వెదికి 'ఇంగ్లీష్ – రష్యన్ బేసిక్ లెర్నింగ్' అనే పుస్తకం తీసుకుంది. తర్వాత ఇద్దరూ ఓ బల్లముందు కూర్చున్నారు.

"ఇక్కడ ఫ్రీ వైఫై సౌకర్యం ఉంది. ఇది ఓ జర్మన్ దంపతులు నడిపే రెస్టరెంట్. అతనే ఈ షెల్ఫ్‌లని ఏర్పాటు చేసాడు. అందులోంచి ఏ పుస్తకం కావాలన్నా ఫ్రీగా తీసుకోవచ్చు. చదివాక మళ్ళీ తెచ్చి ఇక్కడే ఉంచాలి. అవన్నీ ఈ రెస్టరెంట్‌కి వచ్చే కస్టమర్స్ ఇచ్చినవే. చదివేసిన పుస్తకాలని కూడా అక్కడ డొనేషన్‌గా  ఉంచొచ్చు. ఎక్కువ భాగం ఇంగ్లీష్ పుస్తకాలే, యూరోపియన్స్ కూడా ఇక్కడ పైచేస్తున్నారు కాబట్టి యూరోపియన్ భాషల్లో కూడా చాలా పుస్తకాలు ఉన్నాయి. నేను తీసుకున్న పుస్తకంలో రష్యన్ వారాల పేర్లు, నెలల పేర్లు, ఒకటినించి వందదాకా అంకెలు మొదలైనవి నేర్చుకోవచ్చు. ఎలా పలకాలో ఇంగ్లీష్ లో రాసారు కాబట్టీ సమస్య ఉండదు. యూ ట్యూబ్ వీడియోలు కూడా అందుకు సహాయం చేసాయి" చైత్ర చెప్పింది.

జినేంద్రకి వాట్సప్‌లో మెసేజ్ పంపాలన్న ఆలోచన ఆద్యకి అకస్మాత్తుగా వచ్చింది. అంతలో అక్కడున్న నల్లటి బోర్డ్‌మీద ఎవరో అందమైన అక్షరాలతో ఆర్టిస్టిక్‌గా రాసింది కనిపించింది.

'రేపు సూర్యోదయ సమయంలో వెళ్ళిపోయేవారితో నేడూ సూర్యాస్థమయం గడిపి వృధా చేయకు.'

అది ఆమెకి నచ్చింది. నిజానికది తనకో చక్కటి సలహా అనికూడా నిర్ణయించుకుంది. ఆద్య ఇంటర్నెట్‌ని కనెక్ట్ చేయాలనుకున్న ఆలోచనని విరమించుకుంది. చైత్ర పుస్తకం మూసి అడిగింది.

"ప్రపంచంలోని అత్యంత ధనవంతుడు ఎవరు?"

"బిల్‌గేట్స్" అద్య జవాబు చెప్పింది.

"కాని ప్రపంచంలో అతన్ని తలదన్నే కుబేరులు చాలామంది వివిధ దేశాల్లో ఉన్నారు. వారి పేర్లు బయటకి రాకపోవడానికి కారణాలు రెండు. ఒకటి ఫోర్బ్స్ పత్రిక వారి పేర్లని పేర్కొనక పోవడం. కారణం వాళ్ళు అవినీతి కుబేరులు. వారి సంపద బినామీ పేర్లతో ఉండి, చట్టవిరుద్ధంగా సంపాదించింది అవడం. వారంతా ఎక్కువగా ఆఫ్రికా దేశాల్లో, రష్యా, చైనా, ఇండియాలలో ఉన్నారు. నైజీరియన్, రష్యన్ ఆయిల్ మేగ్నెట్స్, ఇండియన్, చైనీస్ అవినీతి రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు. బిల్‌గేట్స్ సంపద విలువ తొమ్మిది వేలకోట్ల డాలర్లు. ఓ నైజీరియన్ మాజీ పెట్రోలియం మంత్రి సంపద ఎనిమిది వేలకోట్ల డాలర్లు. అది వ్యాపారంలో సంపాదించింది కాదు. అవినీతితో ప్రజలని పీడించి సంపాదించింది.

"తమ అక్రమార్జనని వారు స్వదేశాల్లో దాచరు. యూరప్, సింగపూర్, జపాన్, దుబాయ్, అమెరికాలాంటి దేశాల్లో రియల్ ఎస్టేట్‌లలో, స్విస్, కేమన్ ఐలాండ్స్, మారిషస్‌లాంటి చోట్ల బేంకుల్లో దాస్తారు. స్వదేశంలో తక్కువ మొత్తం

ఉంటుంది. లేదా స్వాధీనం చేసేసుకుంటారనే భయం. వారి అవినీతిని కనుక్కున్నా ఏ లంచంతో తాము సంపాదించారో ఆ డబ్బుని లంచంగా ఇచ్చి బయటపడగలరు. అంతా అవినీతిమయం."

తన అక్కకి ప్రపంచ వివిధ పోకడలన్నీ తెలుసని ఆద్య అనుకుంది.

నల్లటి వెయిట్రెస్ వచ్చి మెనూ కార్డ్ ఇచ్చింది.

"మన దేశంలో చెయ్యరు కాని ఇక్కడ ఆడవాళ్ళు వెయిటర్స్‌గా పని చేస్తారు."

వెజ్ రోల్, స్పేనిష్ ఆమ్లెట్, హర్చాటాలని ఆర్డర్ చేసింది.

"ఇక్కడ అనేక దేశాల మెనూ దొరుకుతుంది. హర్చాటా మెక్సికన్ నాన్ – ఆల్కహాలిక్ డ్రింక్. పాలతో చేస్తారది" చైత్ర చెప్పింది.

వెజ్ రోల్ ఆద్యకి చాలా రుచిగా ఉంది. హర్చాటా కూడా బాగా నచ్చింది.

## 16

డోర్ బెల్ మోగగానే అప్పుడే వంట ముగించిన ప్రవర్ధన తలుపు తెరచి వాళ్ళని చిరునవ్వుతో ఆహ్వానించింది.

సూర్యచంద్ర భార్య కేరీబేగ్‌తో తన భర్త వెనకే లోపలకి వచ్చింది. దాన్ని ప్రవర్ధనకి ఇస్తూ భర్తతో చెప్పింది.

"మీకు చెప్తూనే ఉన్నాగా, ద్రాక్షపళ్ళు తీసుకురమ్మని. కార్లో కూర్చోవడం నా ఖర్మ. ద్రాక్ష పళ్ళైతే కడిగి ఇస్తారు. ఏపిల్ కోయడానికి బద్ధకిస్తారేమోనండి."

"ఆ మాత్రం మర్యాద వాళ్ళకి ఉండదా అని దారంటా చెప్తున్నానా? ఐనా వాళ్ళ ఫ్రిజ్‌లో ద్రాక్షపళ్ళు ఉండవనేమిటి? ఉంటే దాచుకుంటారేమో కాని" సూర్యచంద్ర విసుక్కున్నాడు.

"లేకపోయినా వెళ్ళి కొనుక్కురావడానికి నేనేమైనా సి.ఎం.భార్యనా? పి.ఎం భార్యనా? ఆ ఐనంపూడి సంబంధం చేసుకుని ఉంటే ఎంచక్కా ప్రిన్స్‌పల్ సెక్రటరీ పోస్ట్‌కి ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నతని పెళ్ళాంగా వీళ్ళింటికి వచ్చేదాన్ని."

"అది వాడి అదృష్టం. లేదా వాడు కూడా నాలా బేంక్‌లో కేషియరై నా పక్కనే కూర్చునేవాడు."

ప్రవర్ధన ఇద్దరికీ మంచినీళ్ళు ఇచ్చింది. సంజీవ, ప్రవర్ధన నవ్వుతూ వారి సంభాషణ వినసాగారు.

ఆ భార్యాభర్తల సంభాషణ వినే కొత్తవాళ్ళకి వాళ్ళు కీచులాడుకుంటున్నారని కొద్దిసేపటిదాకా అనిపించకమానదు. కాని అందరికీ సీరియస్‌గా అనిపించే అంశాలు వాళ్ళు తేలిగ్గా తీసుకుని మాట్లాడుకుంటారని దగ్గరివారికే తెలుసు.

"ఆద్య ఏదీ?" ఆవిడ చుట్టూ చూస్తూ అడిగింది.

"దాని ఫ్రెండ్ పెళ్ళికి వెళ్ళింది" ప్రవర్ధన చెప్పింది.

"ముందే చెప్పేస్తున్నాను ఆంటీ. మా వారి డ్రస్ నేను సెలక్ట్ చేయలేదు. డబ్బు తగలేయద్దని, కొనుక్కొచ్చా జీన్స్‌ని అక్కడక్కడా నేను చింపుతానన్నా వినలేదు. మీరు రానిచ్చారు కాని గుళ్ళో ఆ పేంట్‌తో రానివ్వరట."

"అదేం ఖర్మో శివాలయానికి తప్ప సాయిబాబా గుడికి వెళ్ళవు కదా. శివాలయంలో ప్రసాదం ఉండదు. సాయిబాబా గుడి బయట భక్తులు సాతాళించిన శెనగలు, అరిసెలు, పాలకోవాలాంటివి తెచ్చి పంచుతూంటారు. గురువారమైతే ఇక చెప్పనే అక్కర్లేదు. కుక్కలకి కూడా" సూర్యచంద్ర భార్యవంక చూస్తూ చెప్పాడు.

"మీది వైరప్రేమ" సంజీవ నవ్వుతూ చెప్పాడు.

"వైరం ఉందంకుల్. అది లేదనను. కాని ప్రేమే దానికి దారి తీసింది. మళ్ళీ అది వెనక్కి వెళ్ళి ప్రేమౌతుందని ఆశపడతానా? ఈయనకి యు టర్న్ చేతకాదు."

అంకుల్ అన్నందుకు సూర్యచంద్ర భార్యకే నవ్వొచ్చి తల తిప్పుకుని నివ్వింది.

"వంట వండావా ప్రవర్ధనమ్మా? లేక నేను వండుతానని ఆగావా?"

"వండేసానులెండి" ప్రవర్ధన నవ్వి చెప్పింది.

"మనింట్లో నెయ్యి ఓ వందగ్రాములైనా ఉందంటావా?" ఆవిడ అడిగింది.

"ఉంది."

"విన్నారుగా. నెయ్యి గిన్నె మీ పక్కన పెడతారు. ఇరవై ఆరేళ్ళనించి ఇన్సూరెన్స్ కడుతున్నారు. అది ఎప్పటికి పూర్తయ్యాను. నాకు డబ్బులు ఎప్పటికి చేతికి వచ్చేనూ? సిగ్గులేకుండా ఒంపుకోండి. నువ్వే చెప్పు ఆంటీ."

సంజీవ దంపతులు ఇద్దరూ ఫక్కున నవ్వారు.

"అంకుల్ నా వంట బావుంటుందని ప్రవర్ధనతో చెప్పద్దు. ఇలాంటివి చెప్పకూడదు. తనది బావుండదని బాధపెట్టినవారవుతారు" ఆవిడ సంజీవతో చెప్పింది.

మొబైల్లో మెసేజ్ వచ్చిన అలర్ట్ విని చెక్ చేసి ఆవిడ చెప్పింది.

"అదేం ఖర్మో! పేరుకి బాయ్ ఫ్రెండ్ తప్ప ఆ మగడు ఒక్క స్వీట్ నథింగ్ మెసేజ్ పంపడు కదా? ఇంటిపన్ను కట్టాలని మెసేజ్. మీ గర్ల్ ఫ్రెండ్ బూతు వీడియోలు కూడా పంపుతుంది. ఈ వెధవని మార్చేయాలి."

"నీకా ముక్క ఏనాడో చెప్పాను. వింటేనా? అసలు మునిసిపల్ కార్పొరేషన్ చెత్తని క్లియర్ చేసే కాంట్రాక్టర్ దగ్గర పనిచేసేవాడిని ఎవడు ప్రేమించమన్నాడు?" సూర్యచంద్ర ప్రశ్నించాడు.

"మీకన్నా ఎక్కువసార్లు కనపడేది వాడే కాబట్టి."

సంజీవ, ప్రవర్ధనలు ఒకరివంక మరొకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకున్నారు.

"ఐనా వీళ్ళముందు డాబుసరి కాకపోతే, నిన్నెవరు ప్రేమిస్తరే పిచ్చి బోండామా."

"నా బాయ్ ఫ్రెండ్ కళ్ళతో చూడటం నేర్చుకోండి. మీకు మీ పెళ్ళాం విలువ బొత్తిగా తెలీడంలేదు."

"నీకింక పిల్లలు పుట్టరు కదుటే. ఓల్డ్ ఏజ్‌లో కాలక్షేపానికి నాకో బుడతడు కావాలన్నానా? ప్రకృతి అది నీ వల్ల కాదన్నదని చెప్పిందన్నావా? అడక్కపోయినా చెప్తున్నా. అది నా గర్ల్ ఫ్రెండ్ దగ్గరకి వెళ్ళడానికి కారణం."

"భోజనానికి లేద్దామా?" ప్రవర్ధన అడిగింది.

"అమ్మయ్య. మనం వచ్చింది దీనికోసమే అని ఇంతసేపటికి వీళ్ళు అర్థం చేసుకున్నారు. మళ్ళీ మర్చిపోయే లోపలే లేవండి" కూర కలుపుకున్నాక ఆవిడ చెప్పింది.

"ఇవేనా చేసింది? నేను మర్యాద తెలిసిన దాన్ని కాబట్టి సరిపోయింది. లేదా మీ ఫ్రిజ్ తెరచి ఏమేం ఉన్నాయో చూసేదాన్ని. నిజానికి ఇవాళ మీరే మా ఇంటికి రావాలని పట్టుపట్టాలనుకున్నాను. ఎప్పుడూ మేమే వస్తున్నాం."

"కొయ్" సూర్యచంద్ర చెప్పాడు.

"మిమ్మల్ని ఎందుకు భోజనానికి పిలవలేదా? మావారు తెచ్చిన బెండకాయలు, ములక్కాయలు చెక్కముక్కలే అనుకో. మా మామగార్ని పంపి ఉండాల్సింది. దాంతో వండిన సాంబార్ తిన్న నా బాయ్ ఫ్రెండ్ పళ్ళ డాక్టర్ దగ్గరకి వెళ్ళాడా? మా ఇంటి ఎడ్రస్ కూడా చెప్పాడు రెండు నెలలు తక్కువ వెధవ. ఆ డాక్టర్‌గారు మరికొందర్ని సాంబార్ అతిథులుగా పంపాడు ఆ రోజు."

"తప్పు నీదే" సూర్యచంద్ర చెప్పాడు.

"నాదెలా ఐంది? చెప్పమ్మా కాస్త."

"నేను వెళ్ళేప్పుడు నువ్వు నా కళ్ళజోడు దాచెయ్యకపోవడం నీ తప్పు. నేనేం చెయ్యను. సంతలో ఓ కొత్త అమ్మాయి వాటిని అమ్ముతోందాయే. ఇంకాస్త ఎక్కువ పచ్చడి వేయి చెల్లమ్మా. నా పెళ్ళయ్యాక ఇంత రుచికరమైన టమోటా పచ్చడి నేను ఎన్నడూ తిని ఎరగను" సూర్యచంద్ర అడిగాడు.

"అది వాక్కాయ పచ్చడండి" ప్రవర్ధన దాన్ని వేస్తూ చెప్పింది.

"విన్నారా? అదీ ఆయన వంట క్వాలిటీ. ఐనా మా దద్దమ్మకి ఇలా మామిడికాయ పచ్చడిని కొబ్బరి పచ్చడిలా అనిపించేలా చేయడం చేతకాదు" సూర్యచంద్ర భార్య తన భర్తవైపు రుసరుసలాడుతూ చుస్తూ చెప్పింది.

ప్రవర్ధనకి నవ్వుకి పొలమారింది.

"మీ ఆవకాయ ఎర్రగా ఉందేమిటి? మా ఆవకాయకిలా మీదానికింకా నల్ల మీసాలు రాలేదు" సూర్యచంద్ర చెప్పాడు.

"ఇంట్లో ఒక్క మీసమైనా ఉండాలని నేనే ఆ ఏర్పాటు చేసాను."

"మీ మామగారు కూడా వస్తే బావుండేది" ప్రవర్ధన చెప్పింది.

"మా మామగారు రిచ్‌మేన్. దోచేస్తారని భయం. ఆయనకు జుట్టులో వెండి, పళ్ళంలో బంగారం, కిడ్నీలో రాళ్ళు ఉన్నాయి" సూర్యచంద్ర భార్య చెప్పింది.

భోజనాలయ్యాక తన భార్యని సూర్యచంద్ర అడిగాడు.

"ఇదిగో, అలవాటు తప్పుతుందేమో? కంచాలన్నీ తీసి కడిగి, తోమి బోర్లించమంటావా?"

"ష్! ఉంచండి. మన వెళ్ళాక ఫ్రిజ్‌లోని మంచిమంచివి వేడి చేసుకుని తింటారు" వాళ్ళకి వినపడేలా భర్త చెవి దగ్గర చేతిని అడ్డుపెట్టుకుని భార్య గుసగుసగా చెప్పింది.

"ఏపిల్స్ కొయ్యి" సంజీవ ప్రవర్ధనతో చెప్పాడు.

"ఒద్దొద్దు. మీ ఫ్రెండ్ వెనక వరస కట్టుడు పళ్ళు మర్చిపోయి వచ్చారు. విన్నారుగా. ఇంకెప్పుడూ ఎవరింటికైనా ద్రాక్షపళ్ళు తీసుకెళ్తాందాం. మర్యాదకి అలా అంటూంటారు తప్ప శ్రమని వాళ్ళూ కొయ్యరు."

మరికొద్దిసేపు కూర్చున్నాక గుమ్మం దాటేప్పుడు ఆవిడ సంజీవతో చెప్పింది.

"మీ ఇంటికి వచ్చి తిన్నాం. మీరూ మా ఇంటికోరోజు వచ్చి తిని వెళ్ళండి అని చెప్పాలన్న మర్యాద మావారికి తెలీదు."

"సరే. మా ఇంటికి భోజనానికి రండి. రేపొద్దున్నకాదు. మళ్ళీ పిల్చినప్పుడు"సూర్యచంద్ర ఆహ్వానించాడు.

"మరే. లేదా వచ్చి పడుకుంటారు. వెళ్ళొస్తాం బామ్మగారు. నేనూ వచ్చినందుకు ఏం అనుకోకమ్మా. మా వారికి నగరంలో బొత్తిగా దార్లు తెలీదు. ఎక్కడికి వెళ్ళినా తోకలా పక్కన నన్ను కూర్చోపెట్టి తీసుకెళ్తాంటారు."

వాళ్ళు వెళ్ళాక కూడా వాళ్ళ మాటలనే తలచుకుని ఇద్దరూ చాలాసేపు నవ్వుకున్నారు.

"భోజరాజులాంటి రాజుంటేనే కాళిదాసు వంటి కవి పుడతాడన్నట్లు.. ఒకరికి తగ్గ మరొకరు" ప్రవర్ధన చెప్పింది.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com

www.telugubooks.in

Post your comments